అసంపూర్తిగా రైల్వే అండర్‌బ్రిడ్జి

- మూడేళ్ల క్రితం ప్రారంభించిన రైల్వే అధికారులు
- నిర్మాణం పూర్తి చేయడంలో నిర్లక్ష్యం
- ఇబ్బందుల్లో ప్రయాణికులు


హరిపురం గ్రామశివారులో ప్రమాదకరంగా అండర్‌బ్రిడ్జి నిర్మాణం

ఓదెల: ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే కాజీపేట్ నుంచి బల్లార్షా సెక్షన్ల మధ్యలో హరిపురం లెవల్ క్రాసింగ్ గేట్ సమీపంలో మూడేళ్ల క్రితం రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మాణం ప్రారంభించింది. అయితే అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. రైల్వేశాఖ అధికారులు, ఇంజనీరింగ్, శాఖాధికారుల తప్పిదంతో అండర్‌బ్రిడ్జి నిరుపయోగంగా, ప్రమాదకరంగా మారింది.

నిర్మాణం పూర్తి చేయడంలో నిర్లక్ష్యం

అండర్‌బ్రిడ్జి నిర్మాణానికి ఇరువైపులా తీసిన కందకాలు ప్రమాదకరంగా మారాయి. రాత్రిపూట వెళ్లే ప్రయాణికులు అందులో పడి గాయాలయ్యే ప్రమాదం ఉంది. హరిపురం అండర్ బ్రిడ్జి పక్క నుంచి మండలంలోని పలు గ్రామాల ప్రజలు ప్రయాణిస్తుంటారు. అయితే రైల్వే అధికారులు అండర్ బ్రిడ్జి పూర్తిచేయడంలో నిర్లక్ష్యం వహించడంతో ప్రయాణికులు అసంపూర్తిగా ఉన్న అండర్‌బ్రిడ్జిలో పడి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. అండర్ బ్రిడ్జిని వెంటనే పూర్తిచేయాలని ప్రయాణికులు, గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నిర్మాణం పూర్తి చేయాలి



హరిపురం గ్రామశివారులో నిర్మించిన అండర్‌బ్రిడ్జి ప్రాణాంతకంగా మారింది. మూడేళ్లక్రితం నిర్మాణం ప్రారంభించిన అండర్‌బ్రిడ్జి వర్షాకాలంలో వరద నీరు చేరి ప్రమాదకరంగా మారుతోంది. రైల్వేశాఖ నిధులు మంజూరు చేసి బ్రిడ్జిని పూర్తిచేయాలి.

– కుంచం మల్లయ్య, మాజీ సర్పంచ్, కొలనూర్

రక్షణ చర్యలు తీసుకోవాలి



హరిపురం గ్రామశివారులో అసంపూర్తిగా ఉన్న అండర్ బ్రిడ్జికి ఇరువైపులా కంచె ఏర్పాటు చేయాలి. రాత్రి పూట బ్రిడ్జిలో పడి ప్రాణాలు గాలిలో కలిసే అవకాశాలున్నాయి. రైల్వేశాఖ వెంటనే ప్రయాణికులకు ఉపయోగపడేలా అండర్ బ్రిడ్జిని పూర్తిచేయాలి.

– ఆళ్ల సుమన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్, పొత్కపల్లి

క్లుప్తంగా

ఓటరు అవగాహన ర్యాలీ


ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ స్వర్ణ

ఎలిగేడు: మండల కేంద్రంలో గురువారం అధికారులు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎలిగేడు బస్టాండు అంబేడ్కర్ విగ్రహం వరకు ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. 2024 జనరల్ ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకుంటామని ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. తహసీల్దార్ జె.స్వర్ణ, ఎంపీడీవో భాస్కర్‌రావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పీఆర్‌ఏఈ జగదీష్, ఆర్‌ఐలు శైలజ, రజిత, ఎంపీడీవో, తహసీల్దార్ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మ ఆదర్శ కమిటీలు పూర్తి చేయాలి


మాట్లాడుతున్న కమిషనర్ వేణుమాధవ్

సుల్తానాబాద్: అమ్మ ఆదర్శ కమిటీలను పాఠశాలల్లో వెంటనే పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ వేణుమాధవ్ అన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయం సమావేశ మందిరంలో మహిళా స్వశక్తి సంఘాల సీఏలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ఆదర్శ కమిటీలు కృషి చేసేందుకు దోహదపడతాయని పేర్కొన్నారు. నోడల్ ఆఫీసర్ దివ్యదర్శన్‌రావు, ఎంఈవో సురేందర్, హెచ్‌ఎంలు రత్నాకర్‌రెడ్డి, శారద, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి ఎన్టీపీసీ అంగీకారం


నిర్దేశిత వెడల్పుతో తారురోడ్డు నిర్మాణ పనులు

రామగుండం: కార్పొరేషన్ 20వ డివిజన్ పరిధిలోని ఎన్టీపీసీ ప్రభావిత గ్రామం మల్యాలపల్లి నుంచి జీరోపాయింట్ వరకు తారు రోడ్డు నిర్మాణానికి ఎన్టీపీసీ అంగీకరించినట్లు కార్పొరేటర్ కన్నూరి సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. కాగా 3.75 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాల్సి ఉండగా కేవలం 3 మీటర్లతో పనులు చేపడుతుండడంతో ఇటీవల కార్పొరేటర్ ఎన్టీపీసీ యాజమాన్యానికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన ఎన్టీపీసీ నిర్దేశిత వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టారు.

ఆలయ చైర్మన్‌కు సన్మానం


సన్మానిస్తున్న గ్రామస్తులు

కమాన్‌పూర్: మండలంలోని జూలపల్లి హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ బొల్లపెల్లి కొమురయ్య గౌడ్‌ను గురువారం ఆలయంలో సన్మానించారు. కొమురయ్య ఆలయ కమిటీకి పన్నెండేళ్లుగా చైర్మన్‌గా కొనసాగుతున్న నేపథ్యంలో గ్రామస్తులు సన్మానించారు.

రేపు ఉచిత మెడికల్ క్యాంపు

గోదావరిఖనిటౌన్: డిఫెన్స్, పారా మిలటరీ విభాగాల్లో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవుతున్న అభ్యర్థులకు, 10వ తరగతి, ఇంటర్ పూర్తయిన విద్యార్థులకు శ్రీచైతన్య డిఫెన్స్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో 20న శనివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు అకాడమీ చైర్మన్ పల్లె శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. ఎనిమిది మంది డాక్టర్లతో మాజీ సైనికుల ఆధ్వర్యంలో 18 రకాల మెడికల్ టెస్టులు పూర్తి ఉచితంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఫోన్: 83094 35264, 90556 44400, 88863 04040, 96526 15525 నంబర్లలో సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

కళాభవన్ నిర్మాణం పూర్తి చేయాలి


వినతిపత్రం ఇస్తున్న సమాఖ్య నాయకులు

కోల్‌సిటీ/గోదావరిఖని: గోదావరిఖనిలో నిలిచిపోయిన కళాభవన్ నిర్మాణం పూర్తయ్యేలా చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్‌ను గోదావరి కళా సంఘాల సమాఖ్య కోరారు. గురువారం ఎమ్మెల్యేను గోదావరి కళా సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కనకం రమణయ్య, కార్యదర్శులు నాగుల శ్రీనివాస్, గద్దల శశిభూషణ్, లెల్లెల వెంకటేశ్వరరావు కలిసి కళాభవన్ నిర్మాణం ఆగిపోవడంపై వినతిపత్రం అందజేశారు. గోదావరిఖనిలో కళాభవన్ లేకపోవడంతో కళాకారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గోదావరి కళా సంఘాల సమాఖ్య విజ్ఞప్తుల మేరకు, స్థానిక హనుమాన్‌నగర్‌లో రూ.4కోట్ల నిధులతో కళాభవన్ నిర్మిస్తామని 2018లో అప్పటి మున్సిపల్ పాలకవర్గం తీర్మానించిందన్నారు. 2019లో భూమిపూజ జరిగిన అనంతరం కాంట్రాక్టర్ అకాల మరణంతో కళాభవన్ నిర్మాణ పనులు ఆగిపోయాయని వివరించారు. ఆగిపోయిన కళాభవన్ నిర్మాణాన్ని తిరిగి చేపట్టాలని ఎమ్మెల్యేను కోరారు. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో చర్చించి భవన నిర్మాణ పనులు జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఫెన్సింగ్ తొలగించిన వారిపై క్రిమినల్ కేసులు



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: కోదండరామాలయం ప్రాంగణంలో తమకు కేటాయించిన ప్రాంతంలో ఫెన్సింగ్, చెట్లను కూల్చివేసిన మున్సిపల్, సింగరేణి, ఎండోమెంట్ అధికారులపై క్రిమినల్ కేసు పెడతామని జీపీపీపీపీజీ వ్యవస్థాపకుడు గుమ్మడి కుమారస్వామి, అధ్యక్షుడు ఎల్.రాజయ్య పేర్కొన్నారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సీతారాముల కళ్యాణం పేరుతో తమకు కేటాయించిన 39గుంటల స్థలానికి వేసిన ఫెన్సింగ్, ఔషధ మొక్కలను కూల్చివేశారన్నారు. తమకు ఏలాంటి సమాచారం లేకుండా అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరించారని పేర్కొన్నారు. ప్రజలకు అధికారులు జవాబుదారీగా ఉండాలన్నారు. అలాగే రామగుండం మున్సిపల్ ప్రాంతానికి రెండురోజులకోసారి మంచినీటి సరఫరా చేస్తూ ఈప్రాంతాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సింగరేణి ఓసీపీ తీరుపై త్వరలో ట్రిబ్యునల్‌కు వెళ్తామని పేర్కొన్నారు. అధికారుల వేతనాల్లో కోత విధించి కూల్చివేసిన ఫెన్సింగ్ స్థానంలో నూతన ఫెన్సింగ్ 15రోజుల్లోగా నిర్మించాలని డిమాండ్ చేశారు. లేకుంటే అధికారుల తీరుపై చట్టపరంగా చర్యలకు సిద్ధమవుతామన్నారు. సమావేశంలో నాయకులు నాగరాజు, బానయ్య, గొడిసెల భీంసేన్, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుందనపల్లి గ్రామస్తులకు శుద్ధజలాలు


వినతిపత్రం అందజేస్తున్న అక్బర్‌నగర్‌వాసులు

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని కుందనపల్లి గ్రామ ప్రజలకు అక్బర్‌నగర్‌లో ఆర్‌వో ప్లాంటు నుంచి నిర్దేశిత రుసుంతో శుద్ధిజలాలు పొందే వీలు కల్పించాలని కోరుతూ గురువారం గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణకు అక్బర్‌నగర్‌వాసులు వినతిపత్రం అందజేశారు. దీనిపై సదరు పంచాయతీ కార్యదర్శి జిల్లా పంచాయతీ అధికారికి నివేదించారు. డీపీవో స్పందిస్తూ కుందనపల్లి, అక్బర్‌నగర్ వాసులకు మిషన్ భగీరథ నీటి సరఫరా లేకపోవడంతో ఆర్‌వో ప్లాంటు నుంచి నిర్వహణ ఖర్చులు వాటర్ క్యానుకు రూ.5 చెల్లించి తీసుకునేందుకు జిల్లా పంచాయతీ అధికారి ఆశలత ఆదేశాలు జారీ చేశారు. వినతిపత్రం అందజేసిన వారిలో కొండల రాజేందర్, రామచంద్రం, సామంత్, సలిగంటి రవి ఉన్నారు.

మట్టిరోడ్డుకు తాత్కాలిక మరమ్మతు


మరమ్మతు చేయిస్తున్న నాయకులు

ముత్తారం: మండలంలోని ఓడేడ్ బస్టాండ్ నుంచి పెద్దమ్మ దేవాలయం వరకు వెళ్లే మట్టిరోడ్డు గతేడాది కురిసిన భారీ వర్షానికి కొట్టుకుపోయింది. వరిపంట కోయడంతో రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతుల విన్నపం మేరకు కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ చొప్పరి సదానందం, పార్టీ మండల అధ్యక్షుడు దొడ్డ బాలాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన మంత్రి ఆదేశాల మేరకు గురువారం స్థానిక నాయకులు తాత్కాలిక మరమ్మతు చేశారు. దీంతో స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. మాజీ సర్పంచ్ సిరికొండ బక్కారావు, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు దాసరి చంద్రమౌళి, నాయకులు దేవునూరి సదానందం, బొళ్లపల్లి పోచాలు, తోట సుధాకర్, నర్రాల మల్లన్న పాల్గొన్నారు.

దూడపై పిచ్చి కుక్క దాడి

కాల్వశ్రీరాంపూర్: పెగడపల్లిలో పత్తి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన దూడపై గురువారం పిచ్చి కుక్క దాడి చేసి, గాయపరిచింది. దూడకు స్థానిక పశువైద్యులు చికిత్స అందించారు. గతేడాది వేసవిలో సైతం శ్రీనివాస్‌రెడ్డికి చెందిన గేదెలు, దూడలపై కుక్క దాడి చేయడంతో మృత్యువాతపడ్డాయి. వేసవిలో గ్రామంలో కుక్కలు తరచూ మనుషులు, పశువులపై దాడి చేస్తున్నాయని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

బీజేపీ మహిళా మోర్చా ఇన్‌చార్జిగా లావణ్య


సోమారపు లావణ్య

గోదావరిఖని: బీజేపీ పెద్దపెల్లి పార్లమెంట్ మహిళా మోర్చా ఇన్‌చార్జిగా గోదావరిఖనికి చెందిన సోమారపు లావణ్యను గురువారం నియమించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గెలుపే ధ్యేయంగా శ్రమిస్తానని ఆమె పేర్కొన్నారు.

భక్తాంజనేయస్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన


ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న భక్తులు

ఓదెల: మండలంలోని ఉప్పరపల్లెలో భక్తాంజనేయ స్వామి ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం ఘనంగా జరిగాయి. ప్రత్యేక పూజారుల సమక్షంలో మూడుగంటల పాటు హోమం, పూజా కార్యక్రమాలతో ధ్వజస్తంభం ప్రతిష్ఠించారు. మాజీ సర్పంచ్ పల్లె ఓదెలు, పొత్కపల్లి సింగిల్‌విండో మాజీ చైర్మన్ గోపు నారాయణరెడ్డి, నాయకులు చిలుక హరికాంత్, పల్లె రాంరాజు, భక్తులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ ఇంట్లో తనిఖీ

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంలోని కౌన్సిలర్ గొట్టం లక్ష్మి ఇంట్లో గురువారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. అక్రమంగా ఇంట్లోకి ప్రవేశించి భయభ్రాంతులకు గురి చేశారని కౌన్సిలర్ ఆరోపించారు. లో బీపీకి గురికావడంతో ఆమెను ఆస్పత్రికి తరలించామని కుమారుడు గొట్టం మహేశ్, కోడలు స్వప్న తెలిపారు. అయితే అధిక వడ్డీకి అప్పు ఇస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో తనిఖీ చేశామని ఎస్సై శ్రవణ్‌కుమార్ ఈ సందర్భంగా తెలిపారు.

వైభవంగా హోమం

సుల్తానాబాద్: మున్సిపల్ పరిధిలోని పూసాలలో పాత గ్రామపంచాయతీ సమీపంలో వైభవంగా హోమం నిర్వహించారు. పూజారి రమేశ్ శర్మ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం హోమం నిర్వహించారు. శుక్రవారం నుంచి ఆదివారం వరకు కాలనీలో బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి విగ్రహాల ఏర్పాటు కోసం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. పోచమ్మ బోనాలతో పాటు ఊరు కట్టడి ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వివిధ కుల సంఘాల నాయకులు, పార్టీల నాయకులు కోట రంగారెడ్డి, తిరుపతిరెడ్డి, బుర్ర శ్రీనివాస్‌గౌడ్, వేగోళం అబ్బయ్యగౌడ్, పురం ప్రేమ్ చందర్‌రావు, రమణ, శంకర్, రవీందర్, గుర్రాల శ్రీనివాస్, కంకణాల తిరుపతి, సతీశ్, పురం రమణ, భారత్ గ్యాస్ సతీశ్, కాల్వల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలి

ఓదెల: మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈవో కె.నరేందర్ ఆదేశించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. సీఈవో మాట్లాడుతూ మండలంలో మంచినీటి సమస్య తలెత్తకుండా చూడాలని, పనిచేయని బోరింగులకు మరమ్మతు చేయాలని సూచించారు. మానేరు పరివాహక ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటడంతో మంచినీటి సరఫరా కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలపై ఎప్పటికప్పుడు ఆరా తీయాలన్నారు. ఈకార్యక్రమంలో ఓదెల ఎంపీడీవో తిరుపతి, ఎంపీవో భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమాజ్‌వాదీ పార్టీకి పలువురి రాజీనామా


రాజీనామా పత్రం చూపిస్తున్న నాయకులు

పెద్దపల్లిరూరల్: సమాజ్‌వాదీ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి పదవులకు రాజీనామా చేస్తున్నామని ఆ పార్టీ నాయకులు మారం తిరుపతితో పాటు నాయకులు లక్ష్మణ్‌యాదవ్, వెంకటరమణ, శ్రీనివాస్, తాతరాజు, ఐలయ్య తెలిపారు. వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. రాజీనామా పత్రాలను పార్టీ అధినేత అఖిలేష్‌యాదవ్‌కు పంపిస్తున్నామని వారు పేర్కొన్నారు.

ఓసీపీ–3 సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి


అధికారితో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: ఆర్జీ–2 పరిధి ఓసీపీ–3 సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ కోరారు. గురువారం సీహెచ్‌పీ ఎస్ఈ సదానందంను కలిసి పలు సమస్యలపై చర్చించారు. ఎంవీ డ్రైవర్ల షెడ్లు, సీహెచ్‌పీ ముందు డ్రైనేజీ వ్యవస్థ, బెల్ట్ క్లీనింగ్ ఫీడర్ల దగ్గర క్లీనింగ్ చేయడం, సీహెచ్‌పీలో డ్యూటీ చేస్తున్న కార్మికులు దుమ్ము, ధూళిలో శ్వాసకోస వ్యాధుల భారిన పడుతున్నారన్నారు. డ్యూటీ ముగిసిన తర్వాత వేడి నీటితో స్నానం చేసి వెళ్లేలా గ్రీజర్లు ఏర్పాటు చేయాలని, ట్రేడ్స్‌మెన్లకు ఆధునిక టూల్స్ అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్జీ–2 ఉపాధ్యక్షుడు కొత్త సత్యనారాయణరెడ్డి, నాయకులు అక్రం, ప్రభాకర్, ఎట్టెం కృష్ణ, మంద రమేశ్, సదానందం, ప్రణయ్, మధు, కొమురెల్లి, కోటి పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న ఫైర్ అధికారులు

పెద్దపల్లిరూరల్: పెట్రోల్ బంకుల్లో అగ్నిప్రమాదం సంభవిస్తే నియంత్రించేందుకు పాటించాల్సిన పద్ధతులపై ఫైర్ ఆఫీసర్ దేవనంది శ్రీనివాస్ పట్టణంలోని పలు పెట్రోల్ బంకుల్లో అవగాహన కల్పించారు. విద్యుత్ షాక్ సర్క్యూట్ కారణంగా ప్రమాదాలు సంభవిస్తే తీసుకోవాల్సిన రక్షణ చర్యల గురించి వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. లీడ్ ఫైర్‌మెన్ మహేందర్‌రెడ్డి, శ్రీనివాస్, శ్రావణ్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, అజ్జు ఉన్నారు.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం


చెక్కు అందజేస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

కోల్‌సిటీ: గోదావరిఖనిలో ఫొటోగ్రాఫర్‌గా రాణిస్తున్న నిరుపేద యువతి పులి శైలజ వివాహానికి ఆర్థిక ఇబ్బందులు ఎదురవ్వడంతో, స్పందించిన ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అండగా నిలిచింది. గురువారం శైలజ వివాహం సందర్భంగా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ద్వారా సేకరించిన రూ.84,866 నగదును చెక్కు రూపంలో పెళ్లికూతురు శైలజకు, అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి భాస్కర్ ఆధ్వర్యంలో ప్రతినిధులు అందజేశారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శనిగరపు మల్లేశ్, కోశాధికారి బండారి ప్రసాద్, ఉపాధ్యక్షులు తోగటి శ్రీధర్, రామగిరి శ్రీనివాస్, గాండ్ల శ్రీనివాస్, ఎలగందుల శ్రీనివాస్, మహిళా ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దమ్మాల తులసి, లలిత, లావణ్య, రెడ్డి రోజారాణి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులకు ప్రమోషన్ పాలసీ అమలు చేయాలి


మాట్లాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

జ్యోతినగర్: ఎన్టీపీసీ రామగుండం ప్రాజెక్టు కాంట్రాక్టు కార్మికులకు ఒప్పందం మేరకు ప్రమోషన్ పాలసీ అమలు చేయాలని కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ప్రాజెక్టు లేబర్ గేట్ రోడ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని వారు మాట్లాడారు. 60ఏళ్లు పైబడిన కార్మికులను తొలగించరాదని, కార్మికులు పొందుతున్న పీహెచ్(హాలిడేలు), అలవెన్స్‌లలో ఎలాంటి కోత విధించకుండా చెల్లించాలన్నారు. యాజమాన్యం కార్మికుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్మిక సమస్యల పరిష్కారం కోసం జేఏసీ ఆధ్వర్యంలో గేట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు కౌశిక హరి, చిలుక శంకర్, నాంసాని శంకర్, రాజ మల్లయ్య, రాఘవరెడ్డి, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

‘సామాజిక న్యాయాన్ని సమాధి చేసిన బీజేపీ’


మాట్లాడుతున్న అనిల్‌కుమార్

గోదావరిఖనిటౌన్: సామాజిక న్యాయాన్ని సమాధి చేసింది బీజేపీ అని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్‌కుమార్ అన్నారు. పెద్దపల్లి జిల్లా కౌన్సిల్ ఆధ్వర్యంలో 2024 పార్లమెంట్ ఎన్నికలు– సామాజిక శక్తుల కర్తవ్యం అంశంపై గురువారం జిల్లా సదస్సును స్థానిక గంగానగర్‌లోని ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. దళితుల్లో అక్షరాస్యత కొరవడిందని, నిరుద్యోగుల రేటు ఎక్కువగా ఉందన్నారు. కేంద్ర సర్కారు నూతన విద్యా విధానంతో దళితులను ఉన్నత విద్యకు దూరం చేసే కుట్ర చేస్తుందని అన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు. అనంతరం ప్రజానాట్య మండలి కళాకారులు మల్లేశ్ టీం పాటలు పాడారు. కోడం స్వామి అధ్యక్షతన జరిగిన సదస్సులో జిల్లా కార్యదర్శి కందుకూరి రాజరత్నం, మద్దెల దినేశ్, టి.రమేశ్‌కుమార్, ఎంఏ గౌస్, ఎరుకల రాజయ్య, ఆసాల రమ, శనివారపు చంద్రశేఖర్, లక్ష్మణ్, మారుపాక రవికుమార్, శనిగరపు చంద్రశేఖర్, జాడి ఆంజనేయులు, గోలి చంద్రశేఖర్, రాజేంద్రప్రసాద్, జగదీశ్, రాజయ్య, సంబోదు కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న సత్యనారాయణరెడ్డి

జ్యోతినగర్: ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టులో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గుజ్జుల సత్యనారాయణరెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఆటోనగర్‌లోని యూనియన్ కార్యాలయంలో మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికులకు జీవో ప్రకారం వేతనాలు ఇవ్వడం లేదని, 12 గంటలు పని చేయించుకుంటున్న పరిస్థితులు ఉన్నాయని, తక్కువ జీతాలతో పనిచేస్తున్న కార్మికుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల వద్ద పనుల కోసం లక్షలాది రూపాయలు వసూలు చేస్తున్న కాంట్రాక్టర్ల ఫర్మ్ రద్దు చేయాలన్నారు. తెలంగాణ ప్రాజెక్టులో టెండర్ పూర్తయినా పాత కార్మికులతోనే పనులు చేపట్టాలని, కొత్తవారి వద్ద డబ్బులు తీసుకొని పెట్టుకునే పరిస్థితిని నిరోధించాలన్నారు. వీటిపై ఎన్టీపీసీ యాజమాన్యం, కార్మిక శాఖ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై విచారణ చేపట్టి న్యాయం చేసేంతవరకు కార్మికుల పక్షాన పోరాడతామని పేర్కొన్నారు. నాయకులు ఆడెపు శంకర్, గుమ్మడి వెంకన్న, గూడూరు వైకుంఠం, రామన్న, చంద్రన్న, శంకర్, రాయమల్లు పాల్గొన్నారు.

జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే


అంగన్‌వాడీ కేంద్రంలో సర్వే బృందం పరిశీలన

రామగుండం: అంతర్గాం మండలం ముర్మూర్ గ్రామంలో గురువారం జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే నిర్వహించారు. గ్రామంలోని ఆదర్శ అంగన్‌వాడీలో నమోదై ఉన్న మహిళల వివరాలు సేకరించి వారి ఆరోగ్య విషయాలపై చర్చించారు. కార్యక్రమంలో సర్వే సూపర్‌వైజర్ జమీల, ఏఎన్‌ఎం మగ్గిడి శిరీష, ఆశ వర్కర్లు పెసరి జ్యోతి, స్రవంతి తదితరులున్నారు.